# విజయవాడ నుండి గుడివాడ వరకు - బస్సులో

- పద్మశ్రీ డా. యస్. వి. రామారావు




నేపుట్టిన వూరు గుడివాడకు వెళ్ళాలి. విజయవాడ బస్సు డిపోలో టిక్కట్టు కోసరం నిలబడ్డాను అందరిలా క్యూలో. ఎప్పటికీ క్యూ కదలదు. టిక్కట్లు అమ్మే అతను బుకింగ్ ఆఫీసులో కటకటాల వెనుక తాపీగా కూర్చొని ఏవో టిక్కట్లు లెఖ్ఖ పెట్టుకుంటున్నాడు. అతని ప్రక్కన మరో అతను కుర్చీలో కూర్చొని ఇతన్ని చూస్తున్నాడు. నేను క్యూలోంచి బయటకు వచ్చి బుకింగ్ ఆఫీసులో అతన్ని అడిగాను. "ఏమండీ మీరు గుడివాడ వెళ్ళే బస్సుకు టిక్కెట్లు ఇస్తారా?" అని. "నేను ఇవ్వను ప్రక్క బుకింగ్ ఆఫీసులో అతను ఇస్తాడు." అన్నాడు. "మరి అక్కడ ఎవరూ లేరే" అన్నాను. "అయితే కాసేపు ఉన్నాక నేను ఇస్తాను. క్యూలోనే నిలబడండి" అన్నాడు. ప్రక్కన ఉన్న అతను ఇవ్వవచ్చుగదా! మా సంభాషణలతో ఏమీ సంబంధం లేనట్లుగ అతను ఇతన్ని చూస్తున్నాడు. చీమ కుట్టినట్టు కూడా లేదు. ఇంతమందిమి క్యూలో నిలబడ్డా వీరిద్దరికి. బుద్ధిమంతుల్లా, ఓపిగ్గా, సైలెంటుగా, గుడివాడ వెళ్ళేవాళ్ళు అందరూ టిక్కట్లకోసరం నిలబడి ఉన్నారు. నాకు ఈ వాతావరణం కంపరం ఎత్తింది. నిర్ల క్ష్యానికి ఇంతకంటే మరో ఉదాహరణ లేదనిపించింది. ప్రభుత్వపు బస్సులు వీళ్ళ స్వంత ఆస్థిలా ఉంది. ప్రయాణీకులు నోరు మూసుకొని ఉండాలి వీళ్ళ దయా దాక్షిణ్యాలపై. అలాగే సాగుతున్నది కాలం.

టిక్కట్టు కౌంటర్ దగ్గర్లో కొన్ని బస్సులు ఉన్నాయి. ఒక్క దానిమీద 'గుడివాడ'కు అని వ్రాసి ఉన్నది బోర్డుమీద. బస్సులో డ్రైవరుగారు తన సీటులో స్టీరింగ్ చక్రం ముందు కూర్చొని ఏదో పేపరు చదువు కుంటున్నాడు. నేను వెళ్ళి "ఏమండీ ఈ బస్సులో టిక్కట్టు ఇస్తారా కండక్టర్ గారూ! గుడివాడకు?" అని అడిగాను. "ఇందులో ఇవ్వరు, క్యూలో నిలబడి కొనిక్కోవలసిందే టిక్కట్టు. అయినా ప్రక్క బస్సు భీమవరంది. అది గుడివాడ బస్సుస్టాండులో ఆగి తర్వాత భీమవరం వెళ్తుంది బస్సులోకి కండక్టరుగారు టిక్కట్టు ఇస్తారు గుడివాడకు" అని సలహా ఇచ్చాడు. ఒక్క మంచి వాడిని, సహాయకారుణ్ణి చూచానని సంతోషించాను.

భీమవరం వెళ్ళే బస్సు ఎక్కాను. మగవాళ్ళు కూర్చొనే సీట్లు, ఆడవాళ్ళ సీట్లు విడివిడిగా ఉన్నాయి. నేను మగవాళ్ళు కూర్చొనే సీటులో కూర్చున్నాను. బస్సు రెండు నిమిషాల్లో కదిలింది. గుడివాడ వెళ్ళవలసినవాళ్ళు టిక్కట్టు కొనేందుకు ఇంకా క్యూలోనే నిలబడి ఉన్నారు. క్యూ కదలడం లేదు. టిక్కట్టు అమ్మవలసిన అతను టిక్కట్లు లెఖ్ఖపెట్టుకుంటూనే ఉన్నాడు ఇంకా. ఈ క్యూలో నిల్చున్నవారికి భీమవరం వెళ్ళే బస్సులో ఎక్కితే గుడివాడలో దిగవచ్చు అని తెలియదా?

బస్సు ప్రయాణం సాగించింది. అరగంట అయిన తర్వాత ఏదో ఊరిలో ఆగింది. నలభై ఏండ్ల లావుపాటి ఆవిడ, ఇంకో ఇరవై అయిదు సంవత్సరాల వయసు - ఆవిడ, పద్దెనిమిది ఏండ్ల సన్నటి కుఱ్ఱాడు బస్సు ఎక్కారు. అందరూ ఒకరినొకరు తెలిసినవాళ్ళలా ఉన్నారు. వాళ్ళలో వాళ్ళు ఏదో మాట్లాడుకుంటున్నారు. స్త్రీలు మాత్రమే అన్న సీట్లలో ఒక భార్య,భర్త గాబోలు కూర్చొని ఉన్నారు. వాళ్ళకు ముప్ఫయి సంవత్సరాలు ఉంటాయి. మరొక సీటులో ఇద్దరు మగవాళ్ళు కూర్చుని ఉనారు. మధ్య వయసు వాళ్ళు. వాళ్ళ సీటుకు "సీనియర్ సిటిజన్స్‌కి మాత్రమే" అని వ్రాసి ఉంది. ఇద్దరు స్త్రీలు, కుఱ్ఱాడు నిల్చొనే ప్రయాణం చేస్తున్నారు. బస్సు పోతున్నది పంట కాలువ ప్రక్కనే.

భార్య, భర్తలు కూర్చున్న సీటు మీద "స్త్రీలకు

మాత్రమే" అని వ్రాసిఉంది గనుక, వాళ్ళు లేచి నిలబడ్డ ఇద్దరు ఆడవాళ్ళలో ఎవరికన్నా కూర్చొనవలసిందలి చెప్పాలి. భర్త లేస్తాడా? లేదు. భార్య,భర్త చేయి పట్టుకొని అతనిని ఇంకా దగ్గరగా లాక్కున్నది,ఒకవేళ పొరపాటున తాను లేస్తాడేమో అని అనుమానించి గాబోలు. నేను నా సీటులో కూర్చొని చూస్తున్నాను ఈ సీను.

భర్త సీటులోంచి లేవడం లేదేమిటి అన్నది చిత్రంగా ఉన్నది నాకు. బస్సు పోతున్నది, కాల్వ ప్రక్కగా. గతుకుల గుంటల రోడ్డుపై గంతులు వేస్తున్నది బస్సు. అటు ఇటు ఊగుతున్నారు ప్రయాణీకులు. నిల్చున్న లావుపాటి ఆవిడ కుదుపులతో కష్టపడుతున్నది ఒక చేత్తో ఇనుపస్తంభం పట్టుకొని. బస్సుకు ఈ కుదుపులు మామూలేలా ఉంది. తాపీగా ఒకే స్పీడులో ప్రయాణం చేస్తున్నది.

లావుపాటి ఆవిడతో "ఏమండీ, మీరు కూర్చోండి" అని లేచి నిలబడ్డాను, నాసీటులోనుండి. పాపం నిలబడి ఇబ్బంది పడ్తున్నది గదా అని. ఆవిడ ముఖం విప్పారింది. "అరేయ్! నువ్వు కూర్చోరా" అన్నది తనతో ఉన్న కుఱ్ఱాడిని. అతను కొడుకో, తమ్ముడో. ఏమి సంకోచం లేకుండా వెంటనే నా సీటులో కూర్చున్నాడు హాయిగా.

ఇది చోద్యమే! నిల్చొని ఇబ్బంది పడ్తున్నదిగదా అని ఈ లావుపాటి ఆవిడ్ని పిలిచి నా సీటు ఇచ్చాను. అలా జరుగలేదే! కూర్చున్న కుఱ్ఱవాడు దుక్కలా ఉన్నాడు. తనకంటె వయసులో పెద్దగదా ఆవిడ. నువ్వు కూర్చో అని అనవలసింది గదా కుఱ్ఱాడు. ఊఁ... ఊఁ... అతనికి అసలు ఇలా అనాలి అని తట్టనేలేదా! ఇది ఏమంత విశేషమైందా ఏమిటి తల బ్రద్దలు కోవడానికి అని అనుకొని ఉంటాడు. ఇండియాలో అందరు ఇలానే ప్రవర్తిస్తారా? ఒక్క ఆంధ్రలో మాత్రమేనా? తెలియదు.

నే చోటు ఇచ్చింది ఆవిడకు,నిలబడగల వయసులో ఉన్నవాడికి కాదు. ఇతనికైతే నేను సీటు ఇచ్చేవాడ్నే కాదు. ఇప్పుడు జరిగిన అన్యాయానికి నా మనసులో బాధగా ఉంది. ఆవిడకు తట్టలేదా నేను ఎందుకు నా సీటు లోనుండి లేచింది? అంత వివక్షత లేకుండా ఉంటారా ఎవరైనా? అసలు లేవడం నాదే తప్పు. బూడిదలో పోసిన పన్నీరైంది నా మంచితనం. నన్ను ఓ వెఱ్ఱి వెంగళప్పగా కట్టింది." ఎవడో ఈ ప్రాంతాలవాడు కాదులా ఉందే. బస్సులో ప్రయాణం చేయడం క్రొత్తేమో వీడికి. అమాయకుడు. మా సంగతి తెలీదు. అవకాశాన్ని మా ఇష్టం వచ్చినట్లుగా ఉపయోగించుకుంటాం. ఏదో సీటులోనుండి లేచాడు గనుక వీడు చెప్పినట్లుగ కూర్చుంటానా! నా ఇష్టం వచ్చిన వాళ్ళని కూర్చోబెడ్తాను. ఒకసారి సీటు ఇస్తే సీటు నాది. నిర్ణయాలు నావి. వీడి ఇష్టాలతో నాకేమిటి పని" అని అనుకుంటుంది గాబోలు. నాకు బలే కోపం వచ్చి ఉడికిపోతున్నాను లోలోపలే.

బస్సు మెత్తగా వెళ్తున్నది. రోడ్డు బాగా ఉన్నది గాబోలు. ప్రయాణీకులు ఎవరి ఎవరి గొడవల్లో వాళ్ళు హాయిగా ఉన్నారు. నాలోనే ఈకుదుపులన్ని. మనసులోనే పడ్తున్న మధన ఈఆవిడతో చెప్పాలి అనిపిస్తున్నది. భరించలేని, కుములుతున్న నా వేదనను. "ఏమిటమ్మా! నాగురించి నీ ఆలోచనలేమిటి? అంత సునాయాసంగా, నిలబడగల యువకుణ్ణి కూర్చోపెట్టావే, నీ కిచ్చిన అవకాశాన్ని అతనికిచ్చి, నీకు బంధుత్వంపై ఎంత మమకారం ఉందో చూపించావా? అది గ్రుడ్డి ప్రేమేమో అనే అనుమానం అసలు రానేలేదా. నీకు వచ్చిన అవకాశాన్ని తీసికొని అనుభవించు, ఇతరులకు పంచడం కాని, ఇవ్వడం కాని చేయక అని మలిచావా కుఱ్ఱాణ్ణి. నీవు చెప్పిచట్లు అతను వింటే అది వినయం క్రింద గుర్తిస్తున్నావా నీపట్ల. అలా అని అనుకోవడం లేదే నేను? ఎందుకని?

నే వదులుకున్న సౌఖ్యాన్ని గౌరవించావా, గుర్తించావా? లేదే! మంచిపని అని అనుకొని నేచేసినది బూడిదలో పోసినపన్నీరు అయిందే. మనమిద్దరం త్యాగం చెయ్యడం కుఱ్ఱాడి కోసరమా?" ఎన్నోవిధాలుగా నా మనసు ఆలోచిస్తున్నది.

బస్సు సగం దూరం వచ్చింది గుడివాడ చేరేందుకు. నా జీవిత అనుభవంలో ఇది క్రొత్తగా ఉంది. నేను నాలుగు దశాబ్దాలుగా నివశిస్తున్న దేశాలలోని వాళ్ళు ప్రవర్తించేలా కాకుండ భిన్నంగా ఉంది, ఇక్కడ ఆంధ్రలో.

"ఏమిటి! చాలాసేపటినుండి నిలుచునే ఉన్నారు. మీరు కూర్చోండి. లేరా అబ్బాయి, వారు కూర్చుంటారు." అన్నది లావుపాటి ఆవిడ. మాటలు నన్ను ఓ కుదుపు కుదిపాయి. మనసులో అనుకుంటున్నదంతా తనకు ఎలా తెల్సింది. నా మనోభావాలు కెరటాలుగా మారి, - ఆవిడని చేరుకున్నాయా? తాను నాపై దృష్టి సారించ గానే నా భావాలన్నీ తెలిసాయి గాబోలు. ఆశ్చర్యంలో మునిగి తేరుకోలేక పోయాను. కుఱ్ఱాడు నావంక చూస్తున్నాడు. లేవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. "లేవొద్దు, కూర్చో" అన్నాను అతనితో. ఆవిడకు నా భావాల్ని తెలియ చెప్పకపోతే నన్ను నేను మోసగించు

కుంటున్నానన్న మాట. అనేశాను ఇక ఉండబట్టలేక. "మీరు కూర్చుంటారని నేను లేచి మీకు నా సీటు ఇచ్చాను. అంతేకాని కుఱ్ఱవానికి కాదు. కూర్చోనివ్వండి అతన్నే. నేను నిల్చుంటాను, ఫరవాలేదు."

"ఏదో పిల్లవాడు గదా అని కూర్చో పెట్టాను" అని సమర్థించుకున్నది ఆవిడ. అంతకంటే ఎక్కువ సంజాయిషీ లేదు. ఇది అంతగా ఆలోచించవల్సిన విషయం కాదు ఆవిడకు. అని అర్థం అయింది నాకు. లేవబోయే కుఱ్ఱాడు కూర్చున్నాడు. అతనికి ఈ గందరగోళంతో సంబంధం లేదు. ఒక్క నిట్టూర్పు వదలి "అమ్మయ్య! ఇక నేను కూర్చున్న సీటునుండి కదలక్కర్లేదు" అని తలచాడు గాబోలు. నేను మాత్రం అప్పటి వరకు నా గుండెల్లో ఉన్న నా మనోభావాల్ని కుండ బ్రద్దలు కొట్టినట్లుగా చెప్పేసాను ఆవిడతో. నీళ్ళు నమల లేదు. నా ఆత్మగౌరవాన్ని గాపాడుకున్నాను. ధైర్యంగా ఆవిడకు, చెప్పినా మనసులోని భావాన్ని, ద్విగుణీకృతమైన శక్తిని తెచ్చుకున్నాను. తేలిక పడింది మనసు. బాగా గాలి పీల్చాను నన్ను నేనే మెచ్చుకుంటూ.

బస్సు వెళ్తున్నది. ఏదో ఊరు రాబోతున్నది. బస్సు వేగం తగ్గింది, ఆగింది. బయటనుండి అమ్మే అతను తినుబండారాలను కొన్నవారికి అందచేయాలని, చేతులు చాపి బస్సు కిటికీలగుండా బయటనుండి అంద చేస్తున్నారు లోపల ఉన్నవాళ్ళకు. కిటికీ దగ్గరగా కూర్చున్న వాళ్ళకు ఇచ్చి, బస్సులోపలి వారికి అందచేయ మని అడుగుతున్నారు. సోడాలు,వేరుశనగలు, బటానీలు, కాల్చిన కండెలు, నీళ్ళ కొబ్బరి బొండాలు, సమోసాలు అలాగ ఏవేవో.

ఇద్దరు మగ ప్రయాణీకులు బస్సు దిగారు. ఇప్పటి వరకు నిల్చున్న లావుపాటి ఆవిడ, తనతో ఉన్న ఆవిడ ఖాళీ అయిన సీట్లలో క్షణం ఆలస్యం చేయకుండ, తటాలున కూర్చున్నారు. కూర్చున్నందుకు చాలా - ఆనందంగా ఉన్నది ఇద్దరికి. నా స్థానంలో మార్పు లేదు. పైన ఉన్న గుండ్రటి ఇనుపరాడ్‌ను పట్టుకొని నిలబడే ఉన్నాను ఒక చేత్తో. మరో చేతిలో ఓ చిన్న సంచి ఉంది బట్టల్తి. అంత బరువైంది కాదు సంచి.

అరవై, అరవై అయిదు సంవత్సరాలు ఉంటాయి - ఆవిడకు. ఆవిడ, మరో ముగ్గురు మగవాళ్ళు ఎక్కారు బస్సు. అందరు నిలబడే ఉన్నారు. బస్సులో మారిన వాతావరణాన్ని చూస్తున్నాను. కొత్తగా ఎక్కిన వాళ్ళు అటు ఇటు చూచి ఎక్కడ సీటులు లేవు అని నిర్ధారణ అయిన తర్వాత నిలబడి ప్రయాణం చేయడానికి సిద్ధపడ్డారు. ఎవరెవరి స్థానాల్లో వారి వారి స్వగత లోకాల్లో సెటిల్ అయిపోయారు. నేనొక్కణ్ణే వీరందరిలో కలవనివాణ్ణి. వాళ్ళ లాంటిది కాదు నాలోకం, నాస్థానం. జీవితంలో జరిగే అన్యాయాలకు సర్దుకు పోవడం, ఎదురు చెప్పలేకపోవడం, మనకెందుకులే, ఎలాగో దిగిపోతాము కదా గమ్యస్థానం వచ్చిన తర్వాత అని ఉదాసీనంగా ఉండేవాడిని కాను. నేనూ వీళ్ళందరిలా పుట్టినవాడినే ఆంధ్రలో. ఇక్కడే ఉంటే వీళ్ళలా ఉండేవాడినేమో, వాళ్ళలానే ఆలోచించే వాడినేమో! విశాల ప్రపంచంలో తిరిగి, తిరిగి మారినవాణ్ణి. జరుగుతున్న డ్రామాలో భాగస్తునిగా చేసింది ఈ బస్సు. ఇది భారత దేశం వాళ్ళ బస్సు. వాళ్ళ బస్సుప్రయాణం చేయాలంటే వాళ్ళలా ఉండు. అలానే ఆలోచించు. లేకపోతే దిగిపో" అంటున్నది బస్సు. ఏమి చేయలేని, అనలేని నిర్వీర్యుణ్ణి. నిలబడి ఉన్నవారు నిలబడే ఉన్నారు. కూర్చున్నవారు కూర్చునే ఉన్నారు. బస్సుకు చింత లేదు. దానిలో పెట్రోలు నిండు మోతాదులో ఉన్నది. అందుకే అది అంత తృప్తిగా, తాపీగా సాగిపోతున్నది. కూర్చున్న వారిలో కొంతమంది హాయిగా కునుకులు తీస్తున్నారు. ఈ డ్రామాలో వారు పాల్గొన లేదు. ఇది అంత విశేషం కాదు. రోజూ మామూలుగా జరిగే సంఘటనలే. మరి నాలో ఈ కలవరమేమిటి?

అరవై, అరవై అయిదు ఏండ్ల ఆవిడ అలాగే నిలబడ్డది. వయసులో శరీరం కుచించుకోబడ్డది- కొంచెం. జీవితంలో పడ్డ కష్టాలు ముఖంపై మడతలుగా ముద్రలు వేసాయి. సహనం ఆవిడ హాల్ మార్క్ "సీనియర్ సిటిజెన్స్‌కు మాత్రమే" ఉన్న సీట్లో కూర్చున్న వారిద్దరు చలనం లేకుండ కూర్చున్నారు. ఈవిడ వాళ్ళ ప్రక్కనే నిలబడ్డది. నిజానికి సీటు ఆవిడది. కండక్టరు గారు అయినా చెప్పవచ్చుగా వాళ్ళలో ఒకర్ని లేవమని. అతను తనకు ఏమి సంబధం లేనట్లే ప్రవర్తించాడు. భార్య,భర్త జంట ఈవిడ గురించి పట్టించుకోవడం లేదు. కిటికీలోంచి బయట వెలుతుర్ని, పరిగెడుతున్న పల్లెటూర్లను చూస్తున్నారు. వీళ్ళ మీద బలే కోపం వస్తున్నది నాకు. ఈవిడ్ని కట్టుకున్న హెన్ పెక్ గాడెవడు? ఎక్కడ పుట్టాడు, ఎలా పెరిగాడు. తన జీవితానికి తాను నిర్వచనం చెప్పుకోలేని వెధవ, స్వలాభి గూడాను. భార్య అంతకంటే చలించలేని రాయి. తన భర్త దగ్గరుంటే చాలు ఆదిపత్యం వహించడానికి.

"చూడండి! నేకూర్చోమన్న చోట కూర్చుంటాడు. తనకున్న మనోభావాలన్నీ నేనిచ్చినవే. తనకు స్వంతజీవితం ఉండ వలసిన అవసరం ఏమి ఉందని? నా మాట జవదాటని, నన్ను అంటి పెట్టుకొని పెరిగే సునిశితమైన తీగగా చేసాను. నాచుట్టూ తిరుగుతూ, నన్ను అంటిపెట్టుకొన్న తీగ నా భర్త. అంతకంటే నాకేం కావాలి. త్రిమూర్తు లంతటి వారిని పసిపాపలుగా చేయగల్గింది స్త్రీశక్తి." అని అనుకుంటోంది గాబోలు. కోపంతో కుతకుతలాడి పోతున్నాను. ఈవిడ కూర్చోడానికి చోటు ఇవ్వలేని స్థల భ్రంశుడను. ఆవిడతో పాటు నిలబడి కుదుపుల్లో ప్రయాణం చేసే తోటి సహచరుణ్ణి.

హాయిగా కూర్చున్న లావుపాటి ఆవిడ తనతో వచ్చిన అమ్మాయి, కుఱ్ఱాడు మాటలాడుకుంటున్నారు వాళ్ళతో వాళ్ళు. కండ్లముందు వున్న ఆవిడ వాళ్ళకు కన్పించడం లేదు. "మేమెందుకు ఈవిడ గురించి తెలుసుకోవాలి? - ఆవిడకు సీటూ లేకపోవడం మాతప్పు కాదుగా. మేమూ నిలబడ్డాంగదా ఇంతకుముందు. అలాగే ఈవిడ" అనుకుంటున్నారు గాబోలు.

బస్సు కుదుపుతున్నది. నిలబడ్డ ఆవిడ కండ్లపాపలో ఓ తెల్ల పొర కన్పిస్తున్నది. అప్పుడా ఉదయించీ ఉదయించని ఉషోదయాన, పచ్చగడ్డిని కప్పిన పల్చటి మసక మసక తెలుపు మంచుపొగ ఆవిరిమాదిరిది. నిన్నటి రోజున దట్టంగా పెరిగిన చక్కటి, చిక్కటి జీవితం ఆవిడది. ఎన్ని వసంతాలు చూచిందో. పుట్టిన పిల్లల్ని ఎంత ప్రేమగా పెంచిందో. తాను తినక పోయినా అందరి ఆకలి తీర్చిన తల్లి. నిండైన జీవితంలో మునిగి తేలింది. మరి ఈ రోజున తనతో భర్త రాలేదా? తోడు లేని నీడ అయిందేమో! పాపం, మరి పిల్లల సంగతేమిటి? వాళ్ళూ అంతే, వాళ్ళ పెళ్ళాల చేతుల్లో కీలు బొమ్మలు గాబోలు. వక్కర్తే ఎక్కడకు వెళ్తుందో! ఏదో ఒక కోడలు గర్భిణి అయితే, ప్రసవించే రోజులు దగ్గర కొస్తున్నాయని, భార్యకు చాకిరి చేసేందుకు కొడుకు పిల్చాడేమో! అందుకని వెళ్తుందా ఈవిడ. ఇంకా పీక్కు తింటూనే ఉన్నారా పిల్లలు-దయా దాక్షిణ్యాలు లేని రాక్షసులు.

అమ్మా, నువ్వెవరవు? అందర్నీ క్షమించే భూమాతవా? నేను చూడలేను చిన్ని, చిన్ని బస్సు కుదుపులకు పెద్దపెద్ద అలలుగా నువ్వు అటూ ఇటూ ఒరగడం. నువ్వు సముద్రానివా? ఎలా బ్రతుకు తున్నావమ్మా వీళ్ళ మధ్య-చూస్తూ కండ్లు లేని వాళ్ళ మధ్య. చేసేదేమి లేక నా మాదిరిగానే నువ్వునూ నిర్లిప్తంగా చూస్తున్నావా. ఎంత వోపిక నీకు. నిన్ను చూస్తుంటే నీవు గడిపిన, గడుపుతున్న జీవితం నాకు - ఆదర్శప్రాయంగా ఉండాలని నా ఆకాంక్ష. నిన్ను చూచి నమస్కారం పెట్టాలి అందరూ. ఓరిమికి నువ్వు ప్రతి రూపానివి. అయినా నిన్ను ఎవరు లెఖ్ఖ చేస్తారులే! నీ సుఖం అక్కర్లేదు బస్సులో వాళ్ళకు, బస్సు బయట ఉన్నవాళ్ళకు గూడా అక్కర్లేదు.

గుడివాడ దగ్గరకు వస్తున్నట్లున్నది. రైసు మిల్లులు కన్పిస్తున్నాయి. కాలేజి దగ్గరకొచ్చింది ప్రపంచానికి అవసరమైన యువతతో నిండిన కాలేజి. గుడివాడ బస్సు స్టాండులో ఆగింది బస్సు. చక్కెరకేళీలు అమ్ముతున్నాడు బస్సు కిటికీ అవతల నిలబడి. సపోటాలు తియ్యగా, పానకంలా ఉంటాయట - అంటున్న మాటలు అంత తియ్యగా ఉన్నాయి. సపోటాలు అలాగే ఉంటాయా? యేమో!

బస్సు దిగాను-బస్సులో ఇమడని నేను. ఎవరో, ఎవరో దిగిపోయారు నామాదిరిగా గుడివాడలో. - లావుపాటి ఆవిడ, తనతో పాటు ఉన్న ఇద్దరు, ఈ పెద్దావిడ దిగలేదు. వీరందరూ ఏ ఊళ్ళో దిగుతారో! నాప్రయాణం అయింది. వాళ్ళది ఇంకా సాగుతున్నది.

********

*Contd from page... 78*

**కాలబంధం...**

వాచీ చూసిన ప్రతిసారీ జ్ఞాపకాల వెల్లువే నిజానికి సంజనకి. దాన్ని చూసిన ప్రతిసారీ ప్రేమ పొంగుతుంది.... ఇష్టమైన మనిషి తలపు రాగానే పొంగినట్లు. గుండె చప్పుళ్ళు ఆగడంతోనే మనిషి మరణాన్ని నిర్ణయిస్తారు కానీ..... ఆమనిషి తాలూకు జ్ఞాపకాలూ, ఆమనిషితో ఏర్పరుచుకున్న అనుబంధాలూ - ఇవి ఆగేదెక్కడ? అవి సాగుతూనే ఉంటాయి. వాటిని నిరంతరం గుర్తుచేసేదే ఈ వాచీ... "నీ కదలికలతో నడిస్తే, అది నా జీవిత చిత్రం" - ఓసారి తనే అనుకున్న మాటలు గుర్తు వచ్చాయి. వాచీనోసారి చేత్తో తడిమింది. చిన్నగా నవ్వుకుని నడక కొనసాగించింది.... వాచీ నడకతో పాటు.

(కొత్తపల్లిగారికి, విద్యకు కృతజ్ఞతలు - సౌమ్య)